**కామెడీ కథ**

## రాధాకృష్ణతో అనూరాధ పెళ్ళయింది!

**పెళ్ళిచూపులకి వచ్చినప్పుడే అతన్ని వలచాననుకుంది ఆమె! అతనితో తన జీవితం ఎంత రొమాంటిక్‌గా వుంటుందనుకుంది. ఆ నొక్కుల జుట్టు, నూనూగు మీసం, మెరిసే చెంపలు, తళుక్కుమనే కళ్ళు. అందగాడే అని తొలిచూపులోనే మరులుకుంది.**

# బకాసురుని వధ

తను నచ్చానని అతను అన్నప్పుడు తన పేరులోనే అర్థభాగాన్నిచ్చిన కృష్ణుడని తెగ మురిసిపోయింది. పెద్దలడగటం తడవు అతనితో పెళ్ళి తనకిష్టమేనంది. అంతగా అతన్ని మోహించిన 'రాధ'కి ఎలాంటి 'కృష్ణుడు' దొరికాడో ఆమెకు తొలిరాత్రి కానీ తెలియలేదు!

ఆమె చేతిలోని పాలగ్లాసందుకుని అతను బల్లమీద పెడుతున్నప్పుడు తన సమాగమం అనిర్వచనీయమైన క్షణమనిపించింది. ఆ కోటి నాడుల దారుల్లో విరిసిన సౌందర్యానుభూతి ఒళ్ళు పులకలెత్తించింది. మరుక్షణం అతను తన చేయి పట్టుకుని తనని చుట్టేసి అక్కున చేర్చుకుంటాడని లోలోపల పొంగిపోతూ గట్టిగా కళ్ళు మూసుకుంది.

"అబ్బ, ఎంత బావుంది?"

అతని గొంతు వినిపించి అరమోడ్పు కన్నులతో చూసింది. ఆ దృశ్యానికి గతుక్కుమంది. చిద్విలాసంగా మంచంమీద బాసింపట్టు వేసుకుని ఒళ్ళో పళ్ళెం పెట్టుకుని మిఠాయుండల 'భరతం' పడుతున్నాడు 'శోభనపు పెళ్ళికొడుకు'. బిత్తరపోయి చూస్తూండిపోయింది 'కొత్త పెళ్ళికూతురు'.

"నాకు మిఠాయి ఇష్టమని మీవాళ్ళకెలా తెలుసు?" అన్నాడు మరో ఉండని హాంఫట్ అంటూ.

ఏడవలేక నవ్వింది ఆమె.

"రా ఇలా వచ్చి కూర్చో" అన్నాడు.

మిఠాయి పళ్ళేన్ని పక్కన పెట్టి తన చేతిని తనలోకి తీసుకుంటాడేమోనని క్షణం పాటు భ్రమపడింది.

"నువ్వూ ఒకటి తిను. మిఠాయి పసందుగా వుంది" అని బాంబు పేల్చాడు.

'ఇలాంటి మొగుడినా తొలిచూపులో వలచింది!' కొన్ని క్షణాలకి ముందు రసానుభూతితో చిరుచెమటలు పట్టిన రాధకి ఇప్పుడే 'భయం'తో ముచ్చెమటలు పట్టాయి!

"నాకిప్పుడు ఎంత ఆకలిగా ఉందో తెలుసా?" అని అతనంటే ప్రణయ కూజితమని అనుకోలేకపోయింది. అలాంటి అనుమానమేదీ లేకుండా "వీటన్నిటినీ ఓ పట్టు పట్టాలని వుంది" అన్నాడతను బల్లమీది పళ్ళ పళ్ళేన్ని చూపిస్తూ.

'దంపత్తాంబూలాలు ఇప్పించే దానికి ముందు ఇద్దరికీ వెండి కంచాలలో భోజనాలు పెట్టారు. అంతలోనే ఆకలంటాడేమిటి? ఈ మొగాడెక్కడ దొరికాడురా బాబూ!' అని ఖంగుతింది ఆమె.

"నువ్వేమీ ముట్టనే ముట్టవు. అంతా తిండిపోతను అంటారని నే సరిగా తినలేదు. నాకిప్పుడు ఆకలిగా వుండదామరి?" అన్నాడు మినప సున్నివుండను చేతబట్టుకుంటూ.

'ఓరి దేవుడా! నందనందనుడి పేరని ప్రణయరాగమాలపించబోతే తనకు దొరికింది నందికేశ్వరుడా!' అని అనుకోకుండా వుండలేకపోయింది.

"అన్నీ నేనే తినేస్తున్నా. తర్వాత నీకాకలేస్తే ఒక్కటీ వుండదు మరి!"

కసకస తినటానికి తోడు నవ్వొకటి! 'తొలిరాత్రి మొగుడి ప్రతాపాన్ని కళ్ళారా చూసుకుని తరించాక ఇంకా నాకు ఆకలి కూడానా మహానుభావా' అని లోలోపల కసిగా పళ్ళు నూరుకుంది.

అతనికి పొలమారింది. మినపసున్ని గొంతు పట్టినట్టుంది. ఉక్కిరిబిక్కిరవుతూన్నాడు... ఆడదాని మనసు! అట్టే కోపం పోయి అట్టే జాలి కలిగింది. గబగబా మంచి నీళ్ళు తెచ్చిచ్చి పొలమారినందుకు పొంగివచ్చిన అతని కన్నీళ్ళని తుడిచింది.

దగ్గరగా వచ్చి చేసిన సేవలకి ముగ్ధుడవుతాడేమోనని అనుకుంది. తన తలలో తురుముకున్న పూల పరిమళానికి పరాజితుడవుతాడేమోనని ఆశపడింది. తన చేతివ్రేళ్ళ స్పర్శకి పులకిస్తాడేమోనని ఆ వెర్రిబాగులది ఎదురుచూసింది. ఇక తినటం ఆపేసి మాటామంతీ మొదలుపెడతాడేమోనని ఆ పిచ్చిపిల్ల భ్రమించింది. మిగిలిన పళ్ళేన్ని పక్కనపెట్టి అతను పళ్ళ పళ్ళేన్ని దగ్గరకి లాక్కునే సరికి పాపం హతాశురాలయిపోయింది!

"నిజంగానే నీకేమీ తినాలనిపించటం లేదా? ఆశ్చర్యంగా వుంది" అన్నాడతను.

పైగా సానుభూతొకటి! ఒళ్ళు మండిపోయింది ఆమెకు. 'మీకు తిండి ధ్యాస తప్ప ఈ శోభనవేళ మరేదీ అనిపించటం లేదా అని నాకు ఆశ్చర్యంగా ఉంది' అని ఆమెకనాలని వుంది. ఎంతేనా సరికొత్త మొగుడు! పైకి అనలేదు కదా.

"మీరు తింటే నేను తిన్నట్టే!" అంది ముఖాన నవ్వు పులుముకుని.

"భలేదానివి. నేను బకాసురుడిననుకున్నావా. ఇక్కడున్నవన్నీ తినటానికి!"

అంతకుముందే తనకు దొరికింది 'కృష్ణుడా', 'బకాసురుడా' అని మనసులో అనుకుంది. అతనా మాట అనేసరికి అంత బాధలోను ఆమెకు నవ్వొచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"ఏమీలేదు"

"అహ! ఏదోవుంది. చెప్పు. ఏమనుకోనులే"

"మా ఫ్రెండు అన్నమాట గుర్తొచ్చింది" అని అబద్ధమాడింది.

"మీ ఫ్రెండు ఏమందేమిటి?"

అమ్మయ్య! తినటం ఆపి మాట్లాడుతున్నాడు. సంభాషణ పెంచటానికిదే అవకాశం.

"తొలిరాత్రి గురించి!" అని కావాలనే అతనికి గుచ్చేసింది.

"మీ ఫ్రెండు ఏమని వుంటుందో నాకు తెలుసు"

నిజంగానే ఆశ్చర్యపడింది. తను అన్నది అబద్ధమే అయినా అతని వూహ ఏమిటో అని కుతూహలంగా అడిగింది "ఏమని వుంటుంది?"అని.


"గదిలోకి వెళ్ళాక... మీ ఆయన మిఠాయి ఉండ తింటానన్నా తిననీయకూడదు. పండు కొరుకుతున్నా కొరకనీయకూడదు... అని చెప్పింది అవునా?"

ఇదేదో గమ్మత్తుగా వుందని "భలే ఊహించారే! మరి ఇంకా ఏమందో చెప్పండి" అంది. ఎలాగయినా కబుర్లు పెంచి అతన్ని తిండిధ్యాస నుంచి మళ్ళించాలని ఆమె ఆశ!

"మిఠాయి ఉండని నీ చేత్తో నువ్వే మీ ఆయనకి తినిపించాలి. పండుని చాకుతో ముక్కలుగా కోసి ఒక్కొక్క ముక్కనీ నువ్వే తినిపించాలి... అని అంది కదూ!"

ఓరి భగవంతుడా! సంభాషణ తిరిగి తిరిగి మళ్ళీ 'తిండి' దగ్గరకే వచ్చింది. తను ఇంతవరకూ తింటున్నది చాలదుట! ఇప్పుడు తినిపించాలంటున్నాడు. ఇక మాట్లాడలేక నీరసంతో మంచం మీద కూలబడింది పెళ్ళికూతురు.

"ఏమిటలా వున్నావు?" ఆపిల్ ముక్కను నములుతూ



తూనే అడిగాడు 'నందికేశ్వర ు'.

అతనివైపు దీర్ఘంగా చూ ు "నాకు నిద్ర వస్తోంది" అంది. నిద్రకి ముందు తొలి ాత్రి అనుభవించవలసిన మధుర క్షణాలు మరికొన్ని ఉ ుటాయని గుర్తుచేస్తూ.

"అప్పుడే నిద్రపోతావా ఇంకా అసలు సంగతి మొదలుకానిదే!" అన్నాడు క ుటిగా.

'మీకసలు సంగతి గు ుందా మహాశయా!' అని అనాలనిపించింది. ప్రణయ ుపంతో ముఖం అటువైపు తిప్పుకుంది.

ఆఖరి ఆపిల్‌ముక్కని ు ుేసి, తడి చేతుల్ని రుమా లుకి తుడుచుకుని సుతార ుా ఆమె చేతుల్ని తనలోకి తీసుకున్నాడు రాధాకృష్ణ "ు ధా!" అతని పిలుపులోని మార్దవానికి చకితురాలైంది ు ు. అతని కరస్పర్శకి ఆమె ఒళ్ళు పులకరించింది. ఇంత ు పు 'తిండి రంధి'లో ముని గిపోయిన మొగుడు తనన ు కళ్ళారా చూసి మురవలే దని కినుక వహించిన కొత్త ు ుకూతురు ఇట్టే జరిగింది మరచిపోయింది. ఇకనైనా ు ుసరాగ జలధిలోకి తనను దింపగలడని ఆశించింది. ు ునివైపు తిరిగి ప్రేమసంకే తంగా మందహాసం చేసింది.

"నీ చేతులు ఇంత ు న్నగా వున్నాయేమిటి?" అన్నాడు ఆమె వ్రేళ్ళను నిమ ు ుతూ.

"ఏం? సన్నగా వుంటే నేను బాగాలేనా?" అని అడి ుంది గోముగా.

"అదికాదు. డైటింగ్ చేస్తున్నావా అని అడుగు ుతున్నా!"

"అదేం లేదు. నేనెప్పుడూ ఇలాగే వుండేదాన్ని"

"అంటే, ఏనాడూ సరిగా తిండి తినవన్నమాట!"

మళ్ళీ తిండిమీదకు ప్రస్తావన తిరుగుతోందని ఆమె ుండె గుభేల్మంది.

"నేను తినటం మొదలుపెడితే మీకు మిగలదని" అంది పరిహాసంగా.

"నువ్వలా కనపడ్డంలేదు. నీతోపాటు నాక్కూడా ుత్యపథ్యం పెట్టేలా వున్నావు"

ఎంత వద్దనుకున్నా సంభాషణ 'తిండి' చుట్టూనే ుిరుగుతోంది. ఆమెకు ప్రాణం ఉసూరుమంది. "రేప ుట్నుంచి మీక్కావల్సినదల్లా చేసి పెడతాకాని, ఆ టాపిక్ వదిలేయండి ప్లీజ్!"

"అలాగే! తెచ్చిన పాలు ఎప్పుడు తాగుదాం?"

తటవర్తి రామచంద్రరావు

ఒళ్లు సెగలు పొగలు కక్కింది ఆమెకు. 'తినటం... తాగటం... వీటిని గురించి తప్ప మరోమాట మీకు మాట్లా డాలనిపించదా మహానుభావా!' అని అడిగేద్దామని ఆమెకు నోటి చివరిదాకా వచ్చేసింది. అతి కష్టంమీద ఉగ్గ బట్టుకుంది.

ఆమె చిరాకు చూపులు చూసినట్టున్నాడు. "పాలు... ఆ తర్వాత తాగాలి కదూ!" అని నవ్వాడు.

'అదయినా తెల్సుకదా!' అని మనసులో అనుకుంది. అసలా ఆలోచన అతనికి వచ్చినందుకు ఆమె బుగ్గలు రాగరంజితమయ్యాయి.

"ఎక్కడినుంచి మొదలుపెట్టను?"

చురుక్కున చూసింది "ఏమిటి?"

"నిన్ను తినటం!"


చకితురాలైంది. "నన్ను తింటారా?"

"అవును. వాటిని తినటం అయింది. ఇక మిగిలింది నువ్వే!"

'ఫర్వాలేదు. విగ్రహపుష్టి నైవేద్య నష్టి అనుకుంది. రసి కుడే!' అనుకుంటూ కన్నార్పకుండా చూసింది.

"ఎక్కడ్నించి ప్రారంభించను?"

సిగ్గుల మొగ్గలు "ఏమిటా మాటలు?" అంది.




"నీలో రుచికరంగా వుండేవి చాలా వున్నాయి. మిఠాయిలాంటి నీ బుగ్గ.ు, కజ్జి కాయల్లాంటి నీ చెవులు, రసగుల్ల లాంటి నీ ముక్కు, ఆపిల్‌పండు లాంటి ు పెదవులు, పనస తొనల్లాంటి నీ మెడ..."

చటుక్కున తనచేత్తో అతని నోరు మూసి "మీ వర్ణన కట్టిపెడతారా. తలుపులు తీసుకొని పారిపొమ్మంటారా" అని కాస్త గట్టిగానే అడిగేసింది.

"ఎక్కడికి పారిపోతావు? ఎయట గొళ్ళెం పెట్టేసింది మీ అక్క. తెల్లవారేదాకా నిన్ను తినటమే నా పని!" అని ప్రమాంతంగా ఆమెను కౌగిలించుకున్నాడు అతను.

★ ★ ★

రెండోనాడు ఎవరేమనుకుంటారో అని సందేహించటం మానేసాడు రాధాకృష్ణ. కొత్త అల్లుడు కదా అని అత్తగారు ఏవేవో చేసి పెడుతోంది. సిగ్గుపడకుండా హాయిగా లాగించేస్తున్నాడు.

పెళ్ళి చూపులనాడు "బొద్దుగా వున్నాడే, జాగ్రత్త! సరిగా చూసుకో" అని అనూరాధ వాళ్ళక్క పరిహాసమాడింది.

చిరుబొజ్జ వున్నా పుష్టిగా వున్నాడని సరిపెట్టుకుంది అప్పుడు. ఇప్పుడు తినటం తప్ప మరోధ్యాస లేని మొగుడ్ని చూసి అక్క ఎక్కడ ఆటపట్టిస్తుందో అని తప్పించుకు తిరుగుతోంది.

ఆమె భయపడినట్టే అయింది. మూడోనాడు సాయంత్రానికి పెళ్ళికొడుక్కి 'కడుపునెప్పి' వచ్చింది. అత్తారింటి 'తిండి' ఫలితం అని ఆమెకు తెలుసు.

ఎవరికైనా ఏమని చెప్పుకుంటుంది. గుడ్లు మిటకరిస్తూ చూసింది.

వాళ్ళ నాన్న కొత్తల్లుడి చికిత్సకోసం డాక్టర్ని తీసుకువచ్చాడు. ఏం తిన్నారని డాక్టరు అడిగాడు. "అల్లుడికి మొహమాటం. పాపం ఏమీ తినడండి" అన్నాడు అనూరాధ వాళ్ళ నాన్న కంగారుగా నవ్వి.

అనూరాధకి ఒళ్ళు మండిపోయింది. వాళ్ళమ్మ చేసినవన్నీ సుష్టుగా మెక్కాడని చెప్పేద్దామనుకుంది.

"ఈ మాత్ర ఇప్పుడొకటి, రాత్రి పడుకునే ముందొకటి వేసుకోండి" అని ఇచ్చాడు డాక్టరు.

'రాత్రి భోజనం మానేయండి' అని డాక్టరు చెబితే ఎంత బావుండును అని అనుకుంటోంది అనూరాధ. అంతలో "మరి లైట్‌గా భోజనం చేయచ్చాండీ?" అని అడగనే అడిగాడు ఆ పిల్ల మొగుడు.

"అత్తారింట్లో భోజనం. లైట్‌గా ఉండమన్నా ఉంటుందా మరి!" అని నవ్వుతూ తలవూపి వెళ్ళిపోయాడు డాక్టరు.

అనూరాధ వాళ్ళ బామ్మవచ్చి పాడు డాక్టరు! పిల్లాడికి దిష్టికొట్టి పోయాడు!" అని ఇన్ని మిరపకాయలు అతని చుట్టూ తిప్పి పొయ్యిలో పోసింది.

★ ★ ★

మూడు నిద్రలయ్యాక మోడ్రన్‌గా తననెక్కడికయినా మొగుడు 'హనీమూన్'కి తీసుకు వెడతాడేమోనని మొదట అనుకుంది అనూరాధ.

ఆ మాట ఎత్తనే లేదతను. అడగటానికి మొహమాటం అడ్డొచ్చి వూరుకుంది.

'హనీమూన్'కి భర్త తీసుకుపోకపోయినా రాధకి బాధ ఏమీ వుండేది కాదు. కాని, పెళ్ళికి వచ్చిన దగ్గరి బంధువులు అటూ ఇటూ అంతా కలిసి తమ వూళ్ళకి రమ్మని రాధాకృష్ణతో చెప్పినదాన్ని అతను అక్షరాలా అమలు పరచటమే రాధ పాలిట పురుగు మీద పుట్రయిపోయింది.

ఆమెను వాళ్ళ మేనత్తగారింటికి తీసుకువెళ్ళాడతను. "మా అత్తయ్య చక్కెర పొంగలి బాగా చేస్తుంది. ఎలా చేయాలో నేర్చుకో!" అని ఆవిడ ఎదురుగానే అన్నాడు.

అతని మేనత్త క్లాసు తీసుకున్నంత పని చేసింది. అనూరాధ చేతనే చక్కెర పొంగలి చేయించింది. "బాగా చేశావ్" అని అతను మెచ్చుకున్నా, అక్కడున్నంత సేపూ ఆమెకు ముళ్ళమీద ఉన్నట్టే అనిపించింది.

ఆ మర్నాడు అక్కడికి దగ్గరే అని రాధాకృష్ణ వాళ్ళ పెత్తల్లి గారింటికి తీసుకువెళ్ళాడు. అతను అడక్కుండానే "మా కిష్టిగాడికి పాలోళీ అంటే ఇష్టమే అమ్మాయీ!" అని అనూరాధ 'మెడలు వొంచి' మరీ చేయటం నేర్పింది ఆవిడ. మొగుడు మహదానందపడిపోతూంటే... "ఇంక మనవూరు వెడదామా" అని అతని చెవిలో సన్నగా చివాట్లు పెట్టకుండా వుండలేకపోయింది ఆమె.

"అప్పుడేనా? మీ పిన్నిగారు నిన్ను తప్పకుండా వాళ్ళూరు తీసుకురమ్మన్నారు. తీసుకురాకపోతే ఆవిడ బాధపడరా మరి! మా చుట్టాలింటికే కాని... మీ చుట్టాలింటికి తీసుకు వెళ్ళకపోతే నలుగురూ నన్ననరా" అన్నాడతను.

భర్త మంచి మనసుకి ఆ క్షణంలో సంబరపడి సరేనంది కాని, తీరా వాళ్ళూరు వెళ్ళాక "అల్లుడిగారికి ఏమిష్టమో కనుక్కోవే!" అని ఆవిడ అనేసరికి "నువ్వేం చేసినా తింటారు పిన్నీ!" అని ఆమె అనేలోగా "మీరు బొబ్బట్లు బాగా చేస్తారని రాధా వాళ్ళక్క చెప్పింది అత్తయ్యగారూ!" అని తూటా పేల్చాడు రాధాకృష్ణ.

చుట్టాలలో ఎవరెవరి హస్తవాసి ఎంత గొప్పదో, ఏఏ వూళ్ళో ఏ స్పెషల్ చక్కగా తయారవుతుందో అతనికి తెల్సినంత బాగా మరెవ్వరికీ తెలియదని అతను వాస్తవంగా 'వాకింగ్ వెబ్‌సైట్' అని నిశ్చయానికొచ్చేసింది ఆమె.

ఆ తర్వాత అనూరాధ వాళ్ళ మేనమామ వాళ్ళింటికోసారి అనుకోకుండా వెళ్ళటం జరిగింది. అక్కడ 'చేగొడీలు, చిట్టిగారెలు' చేయటం నేర్చుకొంది. ఆ తర్వాత అలా అలా చంద్రకాంతలు, కాజాలు, తొక్కుడు లడ్డూలు, అరిసెలు, అప్పాలు, పాలకోవాలు... ఇదీ అదీ అని ఏమిటి 'స్వగృహ ఫుడ్స్' వాళ్ళు అమ్ముతున్న అన్నిరకాల పిండివంటల్నీ తయారు చేయటంలో అనూరాధని 'నిష్ణాతురాలు'ని చేసినందుకు గర్వంగా భుజాలు ఎగరవేస్తూ ఆనందంగా చిరుబొజ్జని తడుముకుంటున్నాడు రాధాకృష్ణ!

మొగుడికి కావాల్సింది చేసిపెట్టటంలో ఆమెకే సమస్యా లేదు. తన భార్య చేతి వంట రుచి చూపిద్దామని అధాత్తుగా ఫ్రెండ్స్‌ని పిలుచుకు వచ్చినా ఆమెకు చింత లేదు. ఆమె బాధల్లా తన భర్త గురించి అందరూ ఏమనుకుంటున్నారో అని! 'తిండిపుష్టి' వున్న మనిషని మెచ్చుకోలుగా ముఖాన అంటే, 'తిండిపోతు' అని చాటుగా అనుకోరని గ్యారంటీ ఏమిటి? భర్తతో ఎక్కడికి వెళ్ళాలన్నా భయమే! ఆమెకు బంధువుల సర్కిల్‌లో తలకొట్టేసినట్టుగా వుంటోంది.

ఈమధ్య మరో కొత్త బాధ మొదలైంది. పెళ్ళయి ఆరు నెలలయిందో లేదో రాధాకృష్ణ పేంట్లన్నీ టైట్ అయిపోయాయి. 'అమ్మ బాబోయ్! ఇలా భర్తని వదిలేస్తే కొన్నాళ్ళకి నడుం చుట్టూ 'టైర్లు' పెంచుకుంటూపోతాడు' అని భయపడిపోయింది.

ఉన్నట్టుండి "ఏమండీ! రోజూ సరదాగా మార్నింగ్ వాక్‌కి వెడదామా?" అంది ఓరోజున. 'నడవకపోతే లావెక్కిపోతావ్ మొగుడా!' అని అనకనే అంది.

"అబ్బ, పొద్దున్న నిద్ర చెడగొట్టుకునే ఆలోచన నీకెలా వచ్చింది రాధీ!" అని రొమాంటిక్‌గా కౌగిలించుకున్నాడు.

పాలకి పళ్ళకి తను కల్పించుకుని బయటకి నడిచిపోతోంది కాని ఆ మహానుభావుడి కాలు కదల్చలేకపోతోంది.

"మీ పేంట్లు వదులు చేయించటానికి ఇంక మార్జిను మిగలటం లేదు" అని చురక తగిలించినా ఆ భోజనప్రియుడికి జ్ఞానోదయం కలగలేదు. "పండక్కి అత్తారింటికి వెడితేసరి. కొత్త బట్టలవే వస్తాయి!" అ

జోకు వేసాడు!

ఆమెకు నవ్వు రాలేదు.

ఈ సమస్యకి పరిష్కారం దొరక్క ఆమె ఇబ్బంది పడిపోతున్న సమయంలో ఆమెను చూద్దామని పరశురాం వచ్చాడు. అతను అనూరాధ వాళ్ళ పెద్దమ్మ కొడుకు. ఆమె అంటే వల్లమాలిన ప్రేమ. తనకు చెల్లెళ్ళు లేరని ఆమెనే తోడబుట్టిన దానిలా చూసుకుంటాడు. అనూరాధ పెళ్ళికి రాలేక పోయాడు. ఐపిఎస్ ట్రైనింగ్‌లో వున్నాడు.

"మీ కొత్త సంసారం ఎలా వుందో చూద్దామని వచ్చానే!" అన్నాడ వస్తూనే.

"బాగానే వుంది" అంది నిస్తేజంగా.

పోలీసువాడు! ఆమె కళ్ళని చదివేసాడు. ఏదో సమస్య వుందని పసిగట్టేసాడు

"ఈ అన్నయ్య దగ్గర దాపరికం వద్దమ్మా! నీ ప్రోబ్లమ్ ఏమిటో నాతో చెప్పు" అన్నాడు అనునయంగా.

ఎలా చెప్పాలో తెలియక ఇబ్బందిపడుతూనే చెప్పింది ఆమె.

"ఏమిటి నీ బాధ? బావగారు నిన్ను సరిగా చూసుకో వటం లేదా?"

"అహ్హే.. అది కాదన్నయ్యా

"మరి?"

ఇదీ నా సమస్య- అని గత ఆరు నెలలుగా ఎక్కడెక్క డికి వెళ్ళారో, భర్త ధర్మమా అని తాను ఏఏ వంటలు నేర్చుకోవల్సి వచ్చిందో, దాని ఫలితంగా తన భర్త 'బరువు' రోజురోజుకీ ఎలా పెరిగిపోతోందో పూసగుచ్చినట్టు చెప్పే సింది. "ఇంక నువ్వేం చేస్తావో నీదే భారం!" అని గాఢంగా నిట్టూర్చింది.

ఆలోచనలో పడ్డాడు పరశురాం.

"నువ్వు ఆలోచించి మంచి అయిడియా చెప్పు. ఇంతలో నీకిష్టమైన అటుకుల ఉప్మా చేసి తెస్తా!" అని కదలబోయింది.

"మీ ఆయనకయితే తొక్కుడు లడ్డూలు, నాకు అటుకుల ఉప్మానా?"

"ఆయన చేత అటుకుల ఉప్మా తినిపించిన రోజున తప్పకుండా నీకు తొక్కుడు లడ్డూలు చేసి పెడతానురా అన్నయ్యా!"

"ఆ మాటమీదనే నిలబడు"


"మీ బావగారొచ్చే వేళయింది. ముందు అయి డియా ఆలోచించు!"

అనూరాధ ఉప్మా చేసి తెచ్చేసరికి ఒక పథకం వేసి వుంచాడు పరశురాం.

"నేనిలా వచ్చానని బావగారికి చెప్పకు. నా ఫోటో ఏద యినా నీ దగ్గరుంటే ఎక్కడేనా దాచిపెట్టెయ్!"

★ ★ ★

రెండు రోజులు పోయాక ఆఫీసుకి శలవు రోజున...




"ఎక్కడికేనా పిక్నిక్‌కి వెడదామండీ!" అంది అనూ రాధ.

"హాయిగా హాలిడే రోజున ఇంట్లో కూర్చుని టీవీ చూడకుండా..." అని ఇంకా ఏదో అనబోతున్నాడు రాధా కృష్ణ.

"మీకిష్టమైన తొక్కుడు లడ్డూలు చేశాను. కార బ్బూంది చేసాను. ఫ్లాస్కునిండా కాఫీ తీసుకువెడదాం. ఇక్కడ ఈ చెత్త టీవీ ప్రోగ్రాములు చూడ్డానికి బదులు బయట ప్రపంచం ఎలావుందో చూస్తూ చెట్లనీ పక్షులనీ పలకరిస్తే ప్రాణానికి హాయిగా వుంటుంది" అంది ఆమె.

తినటానికి కావల్సిందల్లా చేసిపెట్టిన పెళ్ళానికి ఇంత చిన్న కోరిక తీర్చకపోవటం తనకే చిన్నతనమనుకున్నాడో ఏమో, సరేనన్నాడు రాధాకృష్ణ.

అనుకున్న వేళకి అనుకున్న చోటకి భర్తను తీసుకొని పిక్నిక్‌కి వెళ్ళింది ఆమె. మొట్టమొదటిసారిగా 'తిండి' విషయం మర్చిపోయి చుట్టూ కనిపించే ప్రకృతిని తిల కిస్తూ ఆనందించసాగాడతను.

"లడ్డూ తింటారా?" అని కావాలనే కవ్వించింది ఆమె.

"తిందాం. తొందరేముచ్చింది" అన్నాడు... పచ్చికలో చక్కని భంగిమలో కూర్చున్న భార్యకి ఫొటో తీస్తూ.

ఓ గంటసేపుఎంతో ఆనందంగా గడిపారు ఇద్దరూ. అటూ ఇటూ చూడసాగింది ఆమె.

"ఏమిటాలోచిస్తున్నావు?" అని అడిగాడు.

"చీకటి పడుతోంది కదా!" అంది.

'నేనున్నానుగా! నీకేం భయం?' అన్నట్టు నవ్వాడు.

ఇంతలో వాళ్ళు కూర్చున్న చోట చెట్ల గుబురు వెనుక అలికిడయింది.

గబుక్కున అటు తిరిగారిద్దరూ.

ఎవరో నల్ల కళ్ళజోడు, మెడలో టవలు, టకింగ్ చేసిన డ్రస్సుతో వాళ్ళముందు ప్రత్యక్షమయ్యాడు. "ఎవరు నువ్వు? ఎందుకొచ్చావు? అన్న ప్రశ్నలు వాళ్ళు వేయటానికి ముందే జేబులోంచి సర్రున బయటికి తీసిన చాకుని పట్టుకున్నాడు. "అరిస్తే పొడిచేస్తా! కిక్కురు మనకుండా ఆ చేతి గాజులు, మెళ్ళో గొలుసు ఇలా గియ్యి" అన్నాడు అనూరాధ దగ్గరికి వచ్చి.

బిత్తరగా భర్తవైపు చూసింది ఆమె.

అతను పైకి లేవబోతూంటే ఓ తోపు తోసా డావ్యక్తి. రాధాకృష్ణ వెల్లకిలా పడిపోయాడు. చటుక్కున దగ్గరకి వచ్చి ఆమె మెళ్ళో గొలుసు దొరకపుచ్చుకున్నాడతను.

"చచ్చినా ఇవ్వను" అంది ఆమె వెనక్కి గుంజుకుంటూ..

"వాడితో గొడవపడకు రాధీ! తీసిచ్చెయ్" అన్నాడు ముచ్చెమటలు పట్టిన రాధాకృష్ణ.

అతనలా గుడ్లు మిటకరించి చూస్తుండ గానే లేడిలా ఓ గెంతు గెంతి ఆ అగంతకుడి డొక్కలో ఓ తన్ను తన్నింది అనూరాధ.

అంతటి ఆజానుబాహువు మనిషే క్రిందపడిపో యాడు. చేతిలోని చాకు జారిపడిపోయింది. చటుక్కున ఆ చాకు దొరకబుచ్చుకుని అతని మీదకి తిరగబడింది ఆమె.

ఆమెచేత తన్నులు తిని కాలికి బుద్ధి చెప్పిన అగంత కుని వైపే చూస్తూ శిలాప్రతిమలా కూర్చుండిపోయాడు రాధాకృష్ణ.

★ ★ ★

వారం రోజుల తర్వాత అనూరాధని చూడ్డానికి వచ్చాడు పరశురాం.

"ఏమమ్మా! బకాసురుడు ఏమంటున్నాడు?" అని అడిగాడు.

"ఇంకేం బకాసురుడు! పిండివంటల మాట దేవుడె రుగు, మామూలు తిండికూడా తగ్గిపోయింది పాపం మీ బావగారికి"

"ఏమయింది? ఏం చేస్తున్నారేమిటి?"

"పొద్దున్నే జాగింగ్‌కి వెడుతున్నారు. ఆ తర్వాత మొక్కలొచ్చిన పెసలో, శెనగలో తినటం, తర్వాత పాలు. పుల్కా రొట్టెలు. నూనె, నెయ్యి బంద్. స్వీట్సు ముందే లేవు. నెల్లాళ్ళలో ఆరు కేజీలు తగ్గాలని ఒట్టేసుకున్నారు" అని నవ్వింది ఆమె.

"ఆడదాని సాహసం చూసాక పరువు తక్కువ అని పించిందన్న మాట!"

"నీకు చాలా థేంక్సన్నయ్యా!"

"ఏదో కాలేజీలో కరాటే నేర్చుకున్నావు కదాని సలహా చెప్పానుకాని... అంత గట్టిగా తంతావని అనుకోలేదే చెల్లాయ్!" అన్నాడు డొక్క పట్టుకుంటూ.

"సారీ అన్నయ్యా!"

"ఫర్వాలేదమ్మా! చెల్లెలు కోసం ఆ మాత్రం చేయ లేనా?"

"ఇంక మీ బావగారు తినరుట..." అంటూ నవ్వుతూ తొక్కుడు లడ్డూల డబ్బాని అన్నగారి చేతిలో పెట్టింది అనూరాధ.